# కళాభిమాని

లక్షాధికారు లందరిలాగే సుబ్బరామయ్యగారు గొప్ప కళాభిమాని. ఆయన దేశంలో ఎక్కడెక్కడోవున్న గొప్పగొప్ప కళాఖండాలన్నీ తీసుకొచ్చి తన విశాలమైన భవంతిలో అందంగా అమర్చేడు అంతతోనే వూరుకోక తనకు మనసు పుట్టినప్పుడు–చిన్ననాటి అలవాటువల్లనయితేనేం, తోచకపోతేనేం, గొప్ప కళాఖండాల్ని అనుకరిస్తూ, ఆయనా యధాశక్తి చిత్రలేఖనం సాగిస్తూ వుండేవాడు.

సుబ్బరామయ్యగారి అనుంగుపుత్రిక విమలా దేవి. బి. ఏ. ప్యాసయ్యింది. తండ్రిగారంటే ఎంతో వినయవిధేయతలుకూడాను. కుమార్తె బి. ఏ. ప్యాసయ్యినప్పట్నుంచీ, ఆమె వివాహం చూసి ఆనందించాలని సుబ్బరామయ్యగారి తాపత్రయం. అయితే, వారి పరీక్షలకు నిలవగలిగిన యువకుడు ఎవరూ కన్పించలేదు.

ఆ యువకుడు అందంగా వుండాలి. బాగా చదువుకొని వుండాలి. ఉద్యోగం వుండితీరాలని లేదు. విమల అంటే యిష్టంమాత్రం వుండాలి. వీటన్నిటికీ మించి, ఆ యువకుడికి చిత్రకళమీద అభిరుచి వుండాలి.

రాజారావు అందంగా వుంటాడు. ఎమ్. ఏ. వరకు చదివాడు. విమలను ప్రేమించేడు. విమలకూడా అతనిని ప్రేమించేసింది. అయితే వచ్చినచిక్కల్లా రాజారావుకు చిత్రకళ అంటే, కాఫీమీదవున్న యిష్టంకూడా లేదు. పోనీ దానిని తెల్సుకుందామనే అభిరుచి కూడాలేదు. చిన్నప్పుడు, డ్రాయర్, కుర్చీకూడా వెయ్యడం చేతకాక, డ్రాయింగ్ మేష్టారి చేతుల్లో తిన్న దెబ్బలు మరిచిపోలేని రాజారావు, యీ చిత్రకళను నేడు ఎట్లా ప్రేమించగలడు? అందుచేతే విమల రాజారావును పబ్లిక్ గార్డెన్స్‌లో ఓ బెంచీపైన కూర్చోపెట్టి చిలక్కి బోధించినట్లు బోధించ సాగింది...చిత్రకారుల్ని గురించి, తమ యింట్లోవున్న కళాఖండాల్ని గురించి.

రాజారావు అంతా చిర్నవ్వుతో ఎంతో ప్రశాంతంగా విని, "లాభంలేదు విమలా! నువ్వింకే పేర్లన్నా చెప్పుగాని, నాకా పేర్లు గుర్తుండవు. ఈ పరీక్షలో నేను ప్యాసవను. మన పెళ్లి యీ జన్మలో జరగదు. నాకా భాగ్యంలేదు," అన్నాడు.

"అదేమిటి రాజూ! ప్రయత్నిస్తే చెయ్యలేనిదంటూ వుంటుందా? ఆ

డ్రాయింగ్ మేష్టారి సంగతి మరచిపోయి నువ్వో గొప్ప చిత్రకారుడి వనుకో. నీ చిత్రాలు అంతర్జాతీయ ఖ్యాతిని పొందే యనుకో. వూ ... అనుకో ... అప్పుడు యీ పేర్లన్నీ అతిసులువుగా గుర్తుం టాయి. చూడు, నువ్వు లోపలికొచ్చి మా నాన్నగారి రూంలో కూరోచ్చగానే నీకు ఎదురుగా కన్పించేవి మూడు కళాఖండాలు. ఎడమవైపునుంచి మొద టిది...రవివర్మ గీసింది. రెండవది, పణి క్కర్, మూడవది పైడిరాజుగారు గీసింది. ఊ ... యిప్పుడు చెప్పు," అన్నది లాలనగా, రాజారావు భుజం పైన తలపెట్టి.

రాజారావు కళ్లు మూసుకుని, "మొదటి చిత్రం రవిశర్మ గీసింది, రెండోది పైడితల్లిగారిది, మూడోది శంకరనాయర్ కదూ!" అన్నాడు.

"అబ్బ! చంపేస్తున్నావు రాజూ! మూడంటే మూడుపేర్లు ... ఏదీ ... ఓ యాభయిసార్లు అను...రవివర్మ, పణి క్కర్, పైడిరాజు..."

రాజారావుకి యముడ్ని జయించిన సావిత్రి గుర్తుకొచ్చింది. ఈ పరీక్షలో తను గెలిస్తే, తన పేరుకూడా అంత చిరస్థాయిగా వుండాల్సిందే, తనుపడే కష్టానికి.

రాజారావు ఆ మూడుపేర్లను యాభయిసార్లు జపించేక, నలభయి తొమ్మిదోసారి కాబోలు, కరెక్టుగా అనగలేడు. విమలాదేవి ఆనందంతో పరవశమయిపోయి, అతని చేతుల్ని, తన రెండుచేతుల్లోకి తీసుకుని, కళ్ళకు అద్దుకుని, "జాగ్రత్తగా గుర్తుపెట్టుకో. తడబడకు. కావలిస్తే చిన్న కాగితం మీద రాసుకుని, యింట్లోకి రాబోయే ముందు చూసుకో. మరి వస్తా. నాన్న గారు ఎదురుచూస్తూంటారు. నువ్వు కూడా ఓ అరగంటలో వచ్చెయ్యి," అన్నది.


"ఓ. కే. నువ్వేం భయపడకు. నేను కరెక్టుగా చెబుతాలే," అంటూ మళ్లీ ఆ పేర్లు జపించసాగేడు. విమల 'టాటా' చెప్పి కారులో యింటికి వెళ్ళిపోయింది.

*　　*　　*

సుబ్బరామయ్యగారు చిర్నవ్వుతో రాజారావును లోపలకు ఆహ్వానించేరు. కుశలప్రశ్నలు వేసేరు. రాజారావు పెద్దవాళ్ల యోగక్షేమాలు విచారిం చేరు. పనిమనిషి తీసుకొచ్చి యిచ్చిన 'కాఫీ టిఫిన్లు' చల్లారిపోతున్నాయి, తీసుకోమని హెచ్చరించేరు.

రాజారావు బల్లమీదవున్న పుస్తాను కొద్దిగా రుచిచూసి, ధైర్యంగా తల ఎత్తి గోడవైపు చూసేడు. గోడను మూడు చిత్రాలు నిలువెత్తు సైజులో, ఆక్రమించుకుని వున్నాయి.

రాజారావు మొహం సంతోషంతో విప్పారింది. కళ్ళు ఆనందంతో నృత్యం చేస్తున్నాయి. పెదిమలు భయంతో తడ బడుతున్నాయి.




ఫలహారం తినడం ఆపేసిన రాజా రావువైపు చూసిన సుబ్బరామయ్య గారు–"ఏమిటి అట్లా చూస్తున్నారు? ఆ చిత్రాలంటే యిష్టమా?" అన్నారు.

"ఇష్టమా? ఇంకా నెమ్మదిగా అంటారా? రవివర్మగారి చిత్రాలంటే నా మనస్సు ఆనందంతో వురకలు వేస్తుంది. ఆ మొదటిది రవివర్మగారి చిత్రంకదూ?" అన్నాడు రాజారావు.

రాజారావు కళాభిరుచికి సుబ్బ రామయ్యగారు కొంచెం ఆశ్చర్య పడ్డారు. గదిబయటనే తచ్చాడుతూ, పై సంభాషణను విన్న విమల ఆనం దించింది

నెపోలియన్‌లాగ ఎదురుదాడి చేసి సుబ్బరామయ్యగారిని ఆశ్చర్యంతో ముంచెత్తుదా మనుకున్నాడు రాజా రావు. సుబ్బరామయ్యగారి పరీక్షకు ఎదురు చూడకుండానే, తనే "పణిక్కర్ గారి చిత్రాలను ఎంతసేపు చూసినా తనివితీరదుకదా! చాలా గొప్పచిత్రం ఆ రెండోది," అనేసేడు రాజారావు ఉత్సాహంతో కాఫీని గడగడ తాగే సేడు.

సుబ్బరామయ్యగారి ఆనందానికి అంతులేదు. "ఈ యువకుడికి కళలో యింత ప్రవేశంవుందా? అల్లంతదూరం నుంచే ఆ కళాఖండాల్ని ఎంతచక్కగా గుర్తుపట్టకల్గేడు. ఇతనే నా అల్లుడయి తేనా?" అని అనుకున్నాడు.

బయటనే నిలబడి రాజారావు మాటలు విన్న విమల, మూడోచిత్ర

కారుడి పేరు సరిగ్గా చెప్పాలని మనస్సు లోనే వెయ్యిదేవుళ్ళకు మ్రొక్కింది.

ఇంతలో సుబ్బరామయ్యగారు "విమలా యిటురా అమ్మా, ఓసారి," అన్నారు.

"ఏం నాన్నా పిల్చేరా?" అంటూ విమల లోపలికి వచ్చింది. గోడమీద నున్న మూడోచిత్రం ఆమెదృష్టి నాకర్షించింది. అది కొత్తచిత్రం. తనెన్నడూ చూడనిది ఎవరో ప్రవేశంలేనివారు గీసిన కొత్తచిత్రంలా వుంది. అయినా నిలువెత్తుది! ఫ్రేం కట్టించి, చక్కగా గోడను అలంకరించి వుంది. ఎప్పుడు వచ్చిందో యింట్లోకి యీచిత్రం విమలకు అర్థంకాలేదు.

"ఆ మూడోచిత్రం..." అన్నాడు రాజారావు వుత్సాహంగా.

"చాలా గొప్పచిత్రంలెండి కొంచెం వక్కపొడి కావాలా?" అంటూ అడ్డొచ్చి, అలమారులోని వక్కపొడి డబ్బాలోంచి కొంత తండ్రికి, కొంత రాజారావుకి యిచ్చింది విమల!

"భగవాన్! ఈ చిత్రం పేరు ఎట్లాగా తప్పుచెబుతారీయన. దాంతో పరీక్షలో ఎట్లాగా ఫెయిలవుతారు. కాస్సేపు మాట్లాడకుండావుంటే బాగుండును" అనుకుంది విమల

రాజారావు వక్కపొడి త్వరితంగా నమిలి, "ఆ చిత్రంలో గొప్ప శైలి వుంది. అది ఒక్క పైడిరాజుగారివద్దనే వుంది. పైడిరాజుగారి చిత్రం కదూ అది?" అనేసేడు, వుల్లాసంగా సుబ్బరామయ్యగారి మొహంలోకి చూస్తూ

విమలకి చెమట్లుపట్టేయి మూర్ఛ వచ్చినంత పనయ్యింది; పడిపోబోతూ, కుర్చీని ఆనుకుంది.

సుబ్బరామయ్యగారు లేచి, వుద్వేగంతో ముందుకివచ్చి, "నువ్వు నాకు చాలా నచ్చేవోయి. నీకు గొప్ప కళాదృష్టి వుంది. నీలాంటి కళాపిపాసి నా అల్లుడవటంకంటె నేను కోరేదేముంది? చాలా సంతోషం నువ్విట్లా యివ్వాళ ఇక్కడకు రావడం! రోజూ తీరికయినప్పుడు వస్తూండు," అన్నారు.

రాజారావు అత్యుత్సాహంతో సెలవుతీసుకుని పరీక్షహాల్లోంచి బయట పడ్డాడు

ఆ తర్వాత కాబోలు ... రాజారావుతో పెళ్ళయిపోయిన విమల తండ్రిని అడిగింది — "ఆ చిత్రం ఎవరు గీసేరు నాన్నా!" అని.

"నేనేనమ్మా! పైడిరాజుగారి శైలిలో ఎప్పుడో గీసేను. కాని మిత్రులొక్కరూ మెచ్చుకోకపోతే దానిని చాలారోజులు దాచేసేను ఓ రోజున పైడిరాజుగారి చిత్రం పైనుంచి జారి కిందపడి గ్లాసు పగిలితే, నేను గీసిన చిత్రం దానిపైన ఎందుకు పెట్టకూడదనిపించింది. మన అల్లుడొక్కడేనమ్మా గొప్ప విమర్శకుడు. ఆ చిత్రాన్ని అంత గొప్పగా మెచ్చుకున్నాడంటే, అతని కళాభిరుచికి నేను ముగ్ధుడినయిపోయేననుకో! మన అల్లుడు..."

ఆ తర్వాత మాటలు విమలకు ఏమీ విన్పించలేదు-తప్పిపోయిన ప్రమాదం తల్చుకునేసరికి.